# జైహింద్

## -పుట్టగంటి గోపీకృష్ణ



### పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో బహుమతి పొందిన ఉత్తమ నవల

### (గత సంచిక తరువాయి)

**ఆమె చెప్పినట్లు** మయాంక్ గంట తరువాత ఆమె గదిలోకి అడుగు పెట్టాడు.

గది లోపల విశాలమయిన అద్దాల కిటికీ నుండి నగరాన్ని చూస్తున్న కాంచనమాల కనిపించింది అతనికి.

“ఏమి చూస్తున్నారు?” ఆమె పక్కకు వచ్చి తను కూడా చూస్తూ అడిగాడతను.

ఏదురుగా కనిపస్తున్న ఆకాశహర్మ్యాలను ఆమె చూడటం లేదు. ఆమె దృష్టి అంతా ఎదురుగా ఉన్న ఒక పార్కు మీద ఉంది. దాని పేరు ఫ్రెరెర్ పార్క్. దాని వైపు చూపించింది ఆమె. “ఒకప్పుడు అది ఫుట్‌బాల్ గ్రౌండ్. ఎంతో విశాలంగా ఉండేది. ఈ ఆకాశహర్మ్యాలేమీ అప్పుడు లేవు. ఈ మైదానం భారత స్వాతంత్ర పోరాటంలో ఒక ప్రముఖ పాత్ర పోషించింది.” అంది ఆమె.

“ఏమిటా చారిత్రిక సంఘటన?” తను కూడా క్యూరియస్‌గా చూస్తూ అన్నాడు మయాంక్.

“1942, ఫిబ్రవరి 17 న ఇండియన్ నేషనల్ ఆర్మీ ఈ మైదానంలో స్థాపింపబడింది.”

“అంటే ఆజాద్ హింద్ ఫౌజ్ అంటారు. అదేనా?”

“అదే…”

“ఆ విషయం నేను కూడా పుస్తకాలలో చదివాను. కానీ, మన దేశ స్వాతంత్రం కోసం పోరాడాల్సిన సైన్యాన్ని విదేశంలో ఎందుకు సమీకరించవలసి వచ్చింది?”

“అది చెప్పాలంటే నీకు కొద్దిగా చరిత్ర చెప్పాలి. ‘అసలు మీరెందుకు సింగపూరు వచ్చారన్న’ నీ ప్రశ్నకి సమాధానం చెప్పాలి…”

మయాంక్ ఒక నోట్‌బుక్, పెన్సిల్ తీసుకుని ఆమె చెప్పే విషయాలు రాసుకోవటానికి సిద్ధంగా ఉన్నాడు.

“అవి రెండవ ప్రపంచ యుద్ధం ప్రపంచాన్ని చుట్టేసిన రోజులు.

ఇంగ్లాండ్, ఫ్రాన్స్ ఒక వైపు... జర్మనీ, ఇటలీ, జపాన్ మరో వైపు మోహరించి హోరాహోరీ యుద్ధం చేస్తున్నాయి. అప్పటికి అమెరికా, రష్యాలు ఇంకా ప్రత్యక్షంగా యుద్ధంలోకి దిగలేదు. ఒక పక్క రష్యా జర్మనీతో ఉన్న ఒడంబడిక కారణంగా తటస్థంగా ఉండి పోయింది. మరో వైపు అత్యుత్సాహంతో పెర్ల్ హార్బర్ మీద జపాను దాడి చేసే వరకు అమెరికా ఈ యుద్ధ రంగానికి దూరంగా ఉండి పోయింది. యూరప్‌లో మిగిలిన అన్ని దేశాలతో పాటు ఫ్రాన్సు కూడా జర్మనీ ఆక్రమణకు గురయింది. ఇక మిగిలింది బ్రిటిషు సామ్రాజ్యం ఒకటే.

హాంగ్‌కాంగ్, మలయా (ఇప్పటి మలేషియా లోని ప్రాంతాలు), సియామ్ (థాయిలాండ్), జావా, సుమత్ర (ఇప్పటి ఇండోనేషియా), బర్మా (ఇప్పటి మయాన్మార్), సింగపూర్ ప్రాంతాలన్నీ బ్రిటిషు సామ్రాజ్య ఆధీనంలో ఉన్న రోజులవి. ఈ ప్రాంతాలలో భారతీయ మూలాలు ఉన్న పౌరులు లక్షల సంఖ్యలో నివసిస్తున్నారు. సహజంగానే బ్రిటిషు ప్రభుత్వ ఆధీనంలో ఉన్న ఈ ప్రాంతాలను ఆక్రమించుకోవాలని జపాన్ ప్రణాళిక రచించింది. అప్పటికే 25 లక్షల మంది భారతీయులు బ్రిటిషు పక్షాన ప్రపంచ వ్యాప్తంగా పోరాడుతున్నారు. జపాను దాడులను ఎదుర్కోవటానికి వారిలో లక్షకు పైగా ఉన్న సైన్యాన్ని సింగపూరులో నియంత్రించింది బ్రిటిషు ప్రభుత్వం. ఆ సైన్యంలో ఏవో కొందరు అధికారులు తప్ప అందరూ భారతీయులే.

నా తండ్రి బ్రిటిషు మిలటరీలో కెప్టెన్. నా తల్లి నా చిన్నతనంలోనే చనిపోయింది. అందుకే మా నాన్న తను ఎక్కడ పని చేస్తుంటే నన్ను అక్కడకు తీసుకు వెళ్లేవాడు. ఒకొకసారి నన్ను తనతో ఉంచుకోవటం కుదరక పోతే తను ఉండే ప్రదేశానికి దగ్గరలో ఇల్లు అద్దెకు తీసుకుని అక్కడ నన్ను ఉంచేవాడు. అలా నేను 1940 లో, నా ఇరవై ఏళ్ల వయసులో సింగపూర్ వచ్చాను. ఇక్కడ కాలేజీలో చేరాను.

చిన్నప్పటి నుండి పెరిగిన వాతావరణం కావొచ్చు, మా నాన్న ఇచ్చిన తర్ఫీదు కావొచ్చు... మొదటి నుండి నాకు పోరాటాలు కొత్త కాదు. ఆయుధాలు వాడటం కూడా చిన్నప్పటి నుండే తెలుసు.

నేను సింగపూరు వచ్చేటప్పటికి జపాను. బ్రిటిషు దేశాల మధ్య యుద్ధం తీవ్ర స్థాయిలో జరుగుతోంది. సింగపూరు మీద దాడి జరగటానికి ఎన్నో రోజులు పట్టదని అనుకుంటూనే ఉన్నాం. సంవత్సరం తరువాత జపాన్ సైన్యం సింగపూర్ మీద దాడి చేసింది. భీకర యుద్ధం జరిగింది. అనుకున్నదే అయినా, నిజంగా యుద్ధ వాతావరణాన్ని అతి దగ్గరగా చూసింది అప్పుడే. ఏ రోజు ఎటు నుండి ఏం బాంబు వచ్చి పడుతుందో అన్న భయంతో ప్రజలందరూ భయంభయంగా బ్రతికిన రోజులవి. కాలేజీలో చరిత్ర పాఠాలు చదువుతున్న నాకు, పుస్తకాల నుండి కంటే జీవితం ద్వారా ఎక్కువ జ్ఞానం వచ్చింది.

క్రమక్రమంగా జపాను సైన్యం యుద్ధంలో పైచేయి సాధించటం మొదలు పెట్టింది. జపాను సైన్యంతో పోరాడుతూ నా తండ్రి మరణించాడు. ఆఖరి చూపు చూడటానికి శవం కానీ, ఓదార్చటానికి బంధువులు కానీ లేని ఒంటరితనం. చుట్టు

పక్కల ప్రతి రోజూ ఏదో ఒక ఇంట్లో చావు వార్త వినిపించటం అతి మామూలు అయింది. నాకు దొరకని ఓదార్పుని ఇతరులకు పంచటం మొదలు పెట్టాను.

భారతీయుడయిన నా తండ్రి, బ్రిటిషు వారి తరుపున పోరాడుతూ సింగపూరు నేల మీద మరణించటం నాకు వింతగా అనిపించింది. ఎందుకు పోరాడుతున్నారో, ఎవరి కోసం పోరాడుతున్నారో తెలియకుండా పాతిక లక్షల మంది భారతీయులు ప్రపంచ వ్యాప్తంగా ప్రాణాలు పణంగా పెట్టారని తెలుసుకున్న నాకు బ్రిటిషు వాళ్లు మన సంపదలే కాదు, ప్రాణాలు కూడా ఎలా దోచుకుంటున్నారో తెలిసి వచ్చింది. ఇన్ని లక్షల మంది ఇలా మరణిస్తుంటే భారతీయ రాజకీయ నాయకులు యుద్ధం పూర్తయ్యే వరకు బ్రిటిషు వారి మీద ఒత్తిడి తేవొద్దని ప్రజలకు నచ్చ చెప్తూ... ఎలా బ్రిటిషు వారికి సహకరిస్తున్నారో తలచుకుంటే ఒళ్లు మండిపోయేది. తిరిగి బ్రిటిషు పాలనలో ఉన్న ఇండియా వెళ్లబుద్ధి కాలేదు. అడుగు పెడితే స్వతంత్ర భారతంలోనే అడుగు పెట్టాలని తీర్మానించుకున్నాను.

అదే సమయంలో జపాను సైన్యం బ్రిటిషు సైన్యాన్ని ఓడించి సింగపూరు నుండి బర్మా వరకు ఉన్న బ్రిటిషు కాలనీలను స్వంతం చేసుకుంది. అవే కాకుండా హాంగ్‌కాంగ్, మలేషియా, ఇండోనేషియా, కంబోడియా, వియత్నాం కూడా జపాను వారి ఆధీనంలోకి వచ్చాయి. ఆ ప్రక్రియలో ఆయా దేశాల్లో నియుక్తులయిన భారతీయ సైన్యంలోని దాదాపు 20000 మంది భారతీయ సైనికులు చనిపోగా, 50000 మంది యుద్ధ ఖైదీలుగా జపాను వారికి బందీలయ్యారు.

జపాను సైన్యం ముందు ఇప్పుడు రెండు దారులు ఉన్నాయి. యుద్ధం ముగిసే వరకు యుద్ధ ఖైదీలను జైళ్లలో పెట్టి వారిని పోషించటం మొదటి దారి. వారిని తమలో కలుపుకుని బ్రిటిషు వారి మీద యుద్ధానికి వాడుకోవటం రెండవ దారి. అయితే ఏ సైనికుడు కూడా తన శత్రువుతో కలిసి మాతృ దేశం మీద దాడి చేయడు. కానీ భారతీయుల పరిస్థితి వేరు. వారు తమ స్వంత దేశంలో బ్రిటిషు వారి చేత అణగదొక్క బడుతున్నారు. యుద్ధంలో తమకు సహకరించి తమను గెలిపిస్తే స్వాతంత్రం ఇస్తామన్న బ్రిటిషు వారు తమ మాటను ఎంత వరకు నిలుపుకుంటారో నమ్మకం లేదు. మరో వైపు జపాను సైన్యం విజయం మీద విజయం సాధిస్తోంది. బ్రిటిషు వారి మీద విజయాలు సాధిస్తున్న జపాను సైన్యంతో చేతులు కలిపితే మాతృ దేశ దాశ్య శృంఖలాలు విడిపించవచ్చు అని చాలా మంది భావించారు. కానీ వారెవరు జపాను సైన్యం కింద పనిచేయటానికి ఒప్పుకోలేదు. తాము పోరాడుతున్నది తమ దేశాన్ని బ్రిటిషు దాశ్యం నుండి విడిపించి జపానుకు అప్పగించటానికి కాదని తెగేసి చెప్పారు. అందుకే కేవలం భారతీయ సైనికులతో స్వతంత్ర సైన్యం ఏర్పడాల్సిన ఆవశ్యకత కలిగింది. అలా ఏర్పడిన సైన్యానికి కావలసిన ఆర్ధిక సాయం, ఆయుధ సాయం చేయటానికి జపాను అంగీకరించింది.

అలా జపాను యుద్ధ ఖైదీలుగా ఉన్న భారతీయ సైన్యంతో మొదటి స్వచ్ఛమయిన భారతీయ సైన్యం, "ఇండియన్ నేషనల్ ఆర్మీ" 1942, ఫిబ్రవరి 17 న ఏర్పడింది. దాని సుప్రీం కమాండర్‌గా మోహన్ సింగ్‌ని నియమించారు. తరువాత సుభాస్ చంద్ర బోస్ సుప్రీం కమాండర్ అయ్యాక ఇదే సైన్యానికి 'ఆజాద్ హింద్ ఫౌజ్' అని పేరు మార్చారు.

ఆ రోజు... ఇండియన్ నేషనల్ ఆర్మీ ఆవిర్భవిస్తోన్న సందర్భంగా ఎదురుగా కనిపిస్తున్న ఫ్రరెర్ పార్కు ఫుట్‌బాల్ గ్రౌండులో గుమికూడిన వేలాది మందిలో నేను కూడా ఒక దాన్ని..." అంటూ చెప్పింది కాంచనమాల.

"చరిత్రని ఎవరయినా పుస్తకాలలో చదువుతారు. మీతో మాట్లాడుతుంటే చరిత్రే ఎదురుగా వచ్చి మాట్లాడుతున్నట్లు ఉంది..." ఆమె వైపు ఆరాధనగా చూస్తూ అన్నాడు మయాంక్.

"చరిత్ర చాలా క్రూరమయింది మయాంక్. మనిషిని మనిషిగా గుర్తించని కాలం అది. బెంగాల్‌లో కరువు వచ్చి 30 లక్షల మంది ప్రజలు ప్రాణాలు కోల్పోతే, ఏమాత్రం పట్టించుకోకుండా భారతీయ సైనికులను ముందు నిలిపి రెండవ ప్రపంచ యుద్ధపు ఏర్పాట్లలో మునిగిపోయిన బ్రిటిషు ప్రభుత్వం ఉన్న కాలం అది. బ్రతికి ఉన్న మనిషికే కాదు, చనిపోయిన మనిషికి కూడా గౌరవం లభించని కాలం అది."

"కాంచనమాల గారూ అప్పటి యుద్ధంలో చనిపోయిన సైనికుల గౌరవార్ధం ఒక వార్ మెమోరియల్ సింగపూర్‌లోని ఎస్ప్లనేడ్ పార్కులో కట్టారట. రేపు దానిని చూడటానికి వెళ్దాము." అన్నాడు మయాంక్.

ఆమె ఏమీ మాట్లాడ లేదు.

"మీకు అది చూడాలని లేదా?" ఆమె నిరాసక్తత గమనించి అన్నాడు మయాంక్.

"ఆ మెమోరియల్ నేను చూడలేదు కానీ దాని గురించి తెలుసు. రేపు దానిని చూశాక నీకు ఏ అభిప్రాయం కలుగుతుందో చూద్దాం..." అంటూ సంభాషణ అంతటితో ముగించింది కాంచనమాల.

మరుసటి రోజు కాంచనమాలను తీసుకుని హోటల్ గది నుండి కిందకు దిగి వచ్చాడు మయాంక్. హోటల్ ఎదురుగానే ఉంది ఫ్రరెర్ పార్క్. దూరం తక్కువే కాబట్టి, కాలి నడకనే వెళ్లారు ఇద్దరు. కొద్దిసేపు అక్కడ గడిపాక సబ్‌వే ద్వారా ఎస్ప్లనేడ్ పార్క్ స్టేషన్‌కు చేరుకున్నారు. పార్కులో ఉండాల్సిన వార్ మెమోరియల్ చెంతకు చేరుకున్నారు.

ఇప్పుడు అక్కడ ఏ మెమోరియల్ లేదు. మనిషి ఎత్తు ఫలకం మాత్రం ఉంది.

"ఒకప్పుడు ఇక్కడ ఆజాద్ హింద్ ఫౌజ్ ఆధ్వర్యంలో చనిపోయిన సైనికుల గౌరవార్ధం ఒక గొప్ప మెమోరియల్ నిర్మించారు..." చెప్పింది కాంచనమాల. "చనిపోవటానికి సరిగ్గా 40 రోజుల ముందు స్వయంగా నేతాజీ సుభాస్ చంద్ర బోస్ దీనికి శంకుస్థాపన చేశారు. కార్మికులు నెల రోజుల్లో దానిని నిర్మించి జాతికి అంకితమిచ్చారు."

"మరి ఇప్పుడు అది ఏమయింది?"

"రెండవ ప్రపంచ యుద్ధంలో జపాన్ వెనుకడుగు వేయటం మొదలు పెట్టగానే బ్రిటిషు ప్రభుత్వం ఒకటొకటిగా తన సామంత రాజ్యాలను తిరిగి వశం చేసుకోవటం మొదలు పెట్టింది. 1945, ఆగస్టు 15 న ఆజాద్ హింద్ ఫౌజ్ సింగపూర్ నుండి వైదొలగింది. ఆ తరువాత మూడు రోజులకు సుభాస్ చంద్ర బోస్ విమాన ప్రమాదంలో మరణించారు. సింగపూరును తిరిగి స్వాధీనం చేసుకున్న తరువాత బ్రిటిషు ప్రభుత్వం చేసిన మొదటి పని ఇక్కడ ఉన్న మెమోరియల్

పడగొట్టించటం. తరువాత కొన్ని దశాబ్దాల తరువాత సింగపూరులో ఉన్న భారతీయులు చందాలు వేసుకుని ఈ శిలా ఫలకాన్ని ఇక్కడ పెట్టించారని తెలిసింది…” తన్మయత్వంతో దానిని తడిమి చూస్తూ అంది కాంచనమాల.

“ప్రస్తుతం సింగపూరు ప్రభుత్వం దీనిని చారిత్రక ప్రదేశంగా గుర్తించి, తగిన హోదా ఇచ్చింది. మన ప్రధాని సింగపూరు పర్యటన సందర్భంగా ఈ ప్రదేశాన్ని సందర్శించటంతో ఇది ఆ మధ్య వార్తల్లోకి వచ్చింది…” చెప్పాడు మయాంక్. “అప్పుడు ఆ వార్తలు చదివిన నాకు సింగపూరులో ఉన్న యుద్ధ స్మారకాన్ని మన ప్రధాని ఎందుకింత ప్రాముఖ్యత ఇస్తున్నారో అర్థం కాలేదు. ఇప్పుడు మీతో మాట్లాడాక ఆయన పర్యటన అర్థం, పరమార్థం అర్థమయ్యాయి.”

కాంచనమాల ఏమీ మాట్లాడకుండా ఇంకా ఆ స్మారకాన్ని చూస్తూ ఉంది.

ఆ స్మారకం మీద మూడు పదాలు పెద్దగా రాసి ఉన్నాయి. “ఇత్తెహాద్, ఇత్తెమద్, కుర్బానీ” అన్న ఆ వాక్యాలను చూసి, “వాటి అర్థం ఏమిటండీ?” అన్నాడు మయాంక్.

“ఆ మాటల అర్థం ఐక్యత, విశ్వాసం, త్యాగం… ఆజాద్ హింద్ ఫౌజ్ ఏర్పడింది ఆ మూడు ముక్కల పునాది మీదే…” చెప్పింది కాంచనమాల. విశ్రాంతిగా కూర్చుని, కళ్లు మూసుకుని, పావు గంట ధ్యానం చేస్తున్నట్లు గడిపింది ఆమె. ఆమె కళ్ల ముందు పాత జ్ఞాపకాలు వేగంగా కదలాడుతున్నాయి. ఆ రోజు తనతో నడయాడిన వారిలో సగానికి సగం మంది పాతిక సంవత్సరాల వయసు రాకుండానే చనిపోయారు. వారు ఎవరో ఇప్పటి వారికి అసలు తెలియదు. వారి త్యాగాల పునాదుల మీద ఏర్పడిన దేశంలో, స్వాతంత్ర ఫలాలు అనుభవిస్తున్న జాతికి… ఆనాటి పోరాట యోధులను కనీసం గుర్తు చేసుకోవాలన్న భావన కూడా కలగటం లేదు.

మరో పావుగంట అక్కడ గడిపాక వెనక్కి వచ్చారు వారిద్దరు.

లంచ్ చేస్తుంటే మయాంక్ మరో అనుమానం వెలిబుచ్చాడు. “మేడం! ఇక్కడ ఇన్ని వేల మంది సైనికులు భారత దేశ స్వాతంత్రం కోసం పోరాడుతుంటే… అక్కడ మన దేశంలో స్వాతంత్ర పోరాటంలో ఉన్న నాయకులు ఎవరూ వీరికి ఎందుకు సహాయం చేయలేదు?”

“మయాంక్! స్వాతంత్రం రాక ముందు మన దేశంలో మూడు రకాల గ్రూపులు ఉండేవి. మొదటి గ్రూపు బ్రిటిషు సామ్రాజ్యానికి లొంగి ఉంటే అనువయిన సమయంలో వారే స్వరాజ్యం ఇస్తారని నమ్మి, తమకు పాలనలో వాటా ఇస్తే చాలు అని వేడుకున్న వర్గం. రెండవ వర్గం అహింసా మార్గంలో గాంధీ నాయకత్వంలో పోరాడిన వర్గం. మూడవ వర్గం ప్రపంచంలో బ్రిటిషు సామ్రాజ్యం ఎలా బలహీన పడిందో ముందుగా గుర్తించిన వర్గం. ఆ మూడవ వర్గం… అహింస అనేది అన్ని సమయాల్లోనూ పనికిరాదని నమ్మింది. గ్రామ స్వరాజ్యం చెడ్డది కాకపోయినా, పారిశ్రామిక విప్లవ ఫలాలను ఒడిసి పట్టుకోవాలని వాదించింది. శత్రువు, శత్రువు మిత్రుడవుతాడు కాబట్టి బ్రిటిషు వారి శత్రువులయిన జర్మనీ, జపానులతో చేతులు కలిపితే తప్పు లేదని భావించింది. ఆ వర్గానికి నాయకుడు సుభాస్ చంద్ర బోస్. అత్యంత పిన్న వయసులో కాంగ్రెస్ ప్రెసిడెంట్‌గా ఎన్నికయినా… తన సిద్ధాంత విబేధాల కారణంగా కాంగ్రెస్‌లో ఇమడలేక బయటకు

వచ్చి తన మార్గంలో ముందుకు సాగిన విప్లవ యోధుడు. ఆజాద్ హింద్ ఫౌజ్ సుప్రీం కమాండర్‌గా ఢిల్లీని పాలిస్తున్న బ్రిటిషు వారి మీద యుద్ధం ప్రకటించిన ధీరుడు. భారతదేశంలో ఇంకా బ్రిటిషు ప్రభుత్వానికి ఊడిగం చేయటానికి ఇష్టపడుతున్న మొదటి వర్గానికి నేతాజీ సిద్ధాంతాలు రుచించే అవకాశం లేదు. ఇక రెండవ వర్గానికి గాంధీ సిద్ధాంతాలను కాదని నేతాజీని సమర్ధించే ధైర్యం లేదు. గాంధీ, నేతాజీ ఒకరినొకరు వ్యక్తిగతంగా గౌరవించుకున్నా, ఒకరి సిద్ధాంతాలతో మరొకరు అంతే తీవ్రంగా విబేధించారు కూడా. అందుకే భారతీయ నాయకులు నేతాజీని, ఆజాద్ హింద్ ఫౌజును ఆమడ దూరంలో పెట్టారు."

"మేడం! ఒక్క నిమిషం ఆగండి. మీరు నిన్న చెప్పినపుడు ఆజాద్ హింద్ ఫౌజ్ కమాండర్ మోహన్ సింగ్ అని చెప్పారు. ఇప్పుడేమో నేతాజీ సుభాస్ చంద్ర బోస్‌ను ఆజాద్ హింద్ ఫౌజుకు ప్రతీకగా మాట్లాడుతున్నారు. అదెలా సాధ్యం?"

"అవును నిజమే! ఆజాద్ హింద్ ఫౌజుకు మొదటి కమాండర్ మోహన్ సింగే. జపనీయుల జనరల్ 'ఫుజివారా' ఒక ఆలోచన చేశాడు. మామూలుగా అడిగితే భారతీయులు వారికి సహకరించరని అతనికి తెలుసు. భారతీయులు యుద్ధ ఖైదీలుగా చనిపోనయినా చనిపోతారు కానీ శత్రువుకు లొంగరని అర్ధం చేసుకున్నాడు. తమతో కలిసి పోరాటం చేయటానికి భారతీయులు అసలు అంగీకరించరు. అందుకే స్వతంత్ర భారతీయ సైన్యం అనే భావనను తీసుకు వచ్చాడు. భారతీయుల నేత్రుత్వంలో ఒక సైన్యం ఏర్పడుతుందనీ, అది భారతీయ ప్రయోజనాల కోసం పనిచేస్తుందని అందరినీ ఒప్పించాడు. యుద్ధ ఖైదీలలో అత్యంత ఉన్నత పదవిలో ఉన్న మోహన్ సింగ్ నేత్రుత్వంలో ఆజాద్ హింద్ ఫౌజు స్థాపనకు సహకరించాడు. మోహన్‌సింగ్ నిజాయితీపరుడు. మిలటరీ వ్యూహ నిపుణుడు. కానీ, అతనిలో రాజకీయ చతురత లేదు. అందరినీ కలుపుకు పోయే శక్తి లేదు. అంతదాకా ఎందుకు ఆజాద్ హింద్ ఫౌజు స్థాపించిన రోజు నేను కూడా అదే మైదానంలో ఉన్నానని చెప్పాను తప్ప, నేను అందులో చేరానని చెప్పలేదు గుర్తుందా?"

"ఎందుకు?"

"మోహన్ సింగ్ మీద నమ్మకం లేకే. నెమ్మది, నెమ్మదిగా 30000 మందితో మొదలయిన సైన్యం 3000 కు పడిపోయింది."

"మరి ఆ పరిస్థితిలో మార్పు ఎలా వచ్చింది?" అడిగాడు మయాంక్.

"భారతీయుల కోసం భారతీయుల సైన్యం అనే భావన వినిపించగానే ప్రపంచ వ్యాప్తంగా అనేక విమర్శలు వచ్చాయి. సైన్యం అనేది ఏదో ఒక ప్రభుత్వ ఆధ్వర్యంలో పనిచేయాలి తప్ప, కొంత మంది గుంపుగా ఏర్పడితే అది సైన్యం కాదనే వాదనలు వినిపించాయి. అలా జరగాలంటే భారతీయుల నేత్రుత్వంలో భారతీయ ప్రభుత్వం ఏర్పడాలి. అందుకు మోహన్‌సింగ్ స్థాయి సరిపోదు. భారతీయులందరికి ఆమోదయోగ్యుడయిన నాయకుడు కావాలి. అలాంటివాడు నేతాజీ. ఆయన్ని ఒప్పించగలిగితే తప్ప ఈ సైన్యానికి భవిష్యత్తు లేదని జపాను వారికి అర్ధమయింది. అప్పుడు సుభాస్ చంద్ర బోస్

జర్మనీలో ఉన్నాడు. ఆయన్ని ఆగమేఘాల మీద జపాన్ పిలిపించారు. అనేక చర్చల తరువాత ఆజాద్ హింద్ ఫౌజ్ నాయకత్వం స్వీకరించటానికి సుభాస్ చంద్ర బోస్ ఒప్పుకున్నాడు. మొదటి స్వతంత్ర భారత ప్రభుత్వం ఆయన నాయకత్వంలో ఏర్పడింది. భారతదేశానికి ఒక జాతీయ జెండా, జాతీయ గీతం ఏర్పాటు చేశాడు. బ్రిటిషు వారిని తరిమి కొట్టిన తరువాత ఏ రకంగానూ జపాను వారు తమ స్వయం పాలనలో వేలు పెట్టకూడదని రాత పూర్వక ఒడంబడిక చేసుకున్నాడు. ఆ తరువాత స్వయంగా సింగపూరు వచ్చాడు సుభాస్ చంద్ర బోస్. మోహన్ సింగ్ ఆనందంగా తన బాధ్యతలను సుభాస్‌కి అప్పగించాడు. ఆ రోజు నుండి ఆజాద్ హింద్ ఫౌజ్ జాతకం మారిపోయింది. వేల సంఖ్యలో భారతీయులు వచ్చి సైన్యంలో చేరటం మొదలయింది. చూస్తుండగానే ఆ సంఖ్య 50000 దాటి పోయింది. ఆ తరువాత ఇండియన్ నేషనల్ ఆర్మీ ఏమి సాధించింది అన్నది ఒక చరిత్ర…"

"జాతీయ ప్రభుత్వం, జాతీయ గీతమా?" ఆశ్చర్యంగా అడిగాడు మయాంక్.

"అవును. రవీద్రనాథ్ ఠాగూర్ రాసిని జనగణమణ ఆధారంగా ముంతాజ్ హుస్సేన్, కలనల్ ఆబిద్ హసన్ సఫ్రానీ హిందీలో రచించిన జాతీయ గీతం ఇప్పటికీ ఒక అద్భుత గీతం… కెప్టెన్ రామ్‌సింగ్ ఠాకూర్ దీనికి సంగీతం సమకూర్చాడు."

"అంత గొప్ప గీతాన్ని నేను ఎప్పుడూ వినలేదనుకోవటానికి సిగ్గుగా ఉంది మేడం." అన్నాడు మయాంక్.

"సిగ్గుపడాల్సింది నువు కాదు మయాంక్. మన విద్యా వ్యవస్థ. ఇప్పటికీ మన స్కూలు పాఠ్యాంశాల్లో సంబంధం లేని ఫ్రెంచ్ విప్లవం గురించి చెప్తాం తప్ప మనదయిన ఆజాద్ హింద్ ఫౌజ్ గురించి చెప్పం…" అని కళ్ళు మూసుకుంది ఆమె. కొద్దిసేపటి తరువాత అప్రయత్నంగా కాంచనమాల కంఠం నుండి ఆ పాట వెలువడింది.

సుభ, సుఖ్, చయన్‌కీ బరఖా బరసే భారత్ భాగ్య హై జాగా
పంజాబ్, సింధ్, గుజరాత్, మరాఠ, ద్రావిడ్, ఉత్కల్, బంగా
చంచల సాగర్, వింధ్య హిమాచల్, నీల యమునా, గంగా
తేరే నిత గుణ గాయేం…
తుఝుసే జీవన్ పాయేం…
సబ్ జన్ పాయే ఆషా
సూరజ్ బనకర్ జగపర్ చమకే భారత్ నామ్ సుభాగా
జయహో, జయహో, జయహో, జయ జయ జయ జయహో…

రాత్రి పదిన్నర అవుతోంది.

కాంచనమాల హోటల్ గదిలోని కింగ్ సైజు బెడ్ మీద పడుకుని ఉంది.

ఇంతలో ఆమె ఫోన్ మోగింది. అవతల మాట్లాడుతోంది ప్రధానమంత్రి. “మీకు ఏమీ అసౌకర్యంగా లేదు కదా…” అంటున్నాడాయన.

“అదేమీ లేదు. అయామ్ ఫైన్… అప్పుడప్పుడూ నా వలన మీకే ఏదన్నా ఇబ్బందేమో అన్న భావన తప్ప నాకు ఇబ్బంది ఏమీ లేదు.”

ప్రధానమంత్రి కాసేపు మౌనంగా ఉండిపోయాడు. తరువాత నెమ్మదిగా, “మీరు, మా అమ్మ… మీ గతం గురించి ఎవరికీ చెప్పకూడదన్న నిర్ణయం ఎందుకు తీసుకున్నారో నాకు తెలియదు. కానీ… మా అమ్మ మధుబాల ఒక యోధురాలు అనీ, దేశం కోసం మృత్యువుకు నవ్వుతూ ఎదురెళ్లిందనీ… ఆమె బ్రతికి ఉండగా నేను తెలుసుకోలేక పోవటం నాకు చాలా అసంతృప్తిని కలిగించింది.” అన్నాడు.

కాంచనమాల ఏమీ మాట్లాడ లేదు. తాము ఆ నిర్ణయం ఎందుకు తీసుకున్నారో ఇప్పుడు చెప్పినా ఎవరికీ అర్థం కాక పోవొచ్చు. ఈరోజు మంచి నిర్ణయం అనుకున్నది, కొన్ని రోజులు పోయాక అంత మంచిది అనిపించక పోవొచ్చు. అలాంటిది 75 సంవత్సరాల తరువాత, అప్పుడు తాము తీసుకున్న నిర్ణయం మంచిదో, కాదో ఇప్పుడు ఎలా చర్చించ గలదు. అందుకే ఆమెకు మౌనం తప్ప మరో మార్గం లేకపోయింది.

“పోనీండి. అయిందేదో అయిపోయింది. మీ జ్ఞాపకాలలో మా అమ్మకు కూడా తప్పక స్థానం ఉంటుందని నాకు తెలుసు. మీ జ్ఞాపకాలను గ్రంథస్తం చేసినపుడు మా అమ్మ గురించిన నిజాలు కూడా ప్రజలకు తెలుస్తాయి. ఆ స్వార్ధంతోనే మీకు ఈ సహాయాలన్నీ చేస్తున్నాను…” అన్నాడు ప్రధానమంత్రి.

అదీ నిజమే అన్నట్లు తల ఊపింది కాంచనమాల.

తరువాత కాసేపటికి ఆయన ఫోన్ పెట్టేశాడు.

కాంచనమాల కళ్ల ముందు మధుబాల మెదిలింది. మధుబాల అంటే అందానికి మరొక రూపం. స్వచ్ఛమయిన పాల నురగ లాంటి శరీర వర్ణం, నల్లగా నిగనిగలాడే బారాటి జుట్టు, ఎదుటి వ్యక్తి ఎవరయినా సరే ఆమె కళ్లలో కళ్ళు పెట్టి చూడలేక చూపులు మరల్చుకోవాలని అనిపించే అంత తీక్షణమయిన చూపు... మధుబాల అంటే పేలటానికి తయారుగా ఉన్న డైనమైట్. మధుబాల అంటే పిన్ను ఊడబీకిన గ్రెనేడ్. తిరుగుబాటు ఆమె రక్తంలో ఉంది. ఆ తిరుగుబాటు… కుటుంబం మీద అయినా, వ్యవస్థ మీద అయినా, ప్రభుత్వం మీద అయినా ఆమె ఏనాడూ వెనుకడుగు వేయలేదు. దేశం కోసం చావటానికయినా, చంపటానికయినా సదా సిద్ధంగా ఉండేది.

అసలే నిద్ర పట్టని ఆమెను మధుబాల జ్ఞాపకాలు చుట్టుముట్టాయి.

1930 దశకం...

మధుబాల అలహాబాద్‌లో ఉన్నత జమిందారీ కుటుంబంలో పుట్టింది. తండ్రి బ్రిటిషు వారికి అత్యంత సన్నిహితంగా మెలిగేవాడు. తల్లికి ఇల్లు తప్ప మరో లోకం తెలియదు.

అలహాబాద్ మొదటి నుండి రాజకీయాలకు కేంద్ర బిందువుగా ఉండేది. ఆడపిల్లలను బడికి పంపటం అరుదే అయినా బ్రిటిషు వారి సాహచర్యం వలన కూతురును మిషనరీ స్కూలుకు పంపేవాడు మధుబాల తండ్రి. అసలే మిషనరీలు నడుపుతున్న స్కూలు కావటంతో అక్కడ రాజకీయ విషయాలు, ముఖ్యంగా బ్రిటిషు వారికి వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమాల గురించి పిల్లలకు తెలియనిచ్చేవారు కాదు. దేశంలో జరుగుతున్న పీడన గురించి, స్వాతంత్ర పోరాటం గురించి ఏమీ తెలియకుండానే పెరిగింది మధుబాల.

1931, ఫిబ్రవరి 27 న మొదటిసారి పదకొండేళ్ళ వయసులో స్వతంత్ర పోరాటం గురించి ఆమె వినాల్సి వచ్చింది. ఆ రోజు హఠాత్తుగా నగరం మొత్తం ఉద్రిక్తంగా మారింది. అప్పటికప్పుడు స్కూలుకు సెలవు ఇచ్చి పిల్లలందరినీ ఇళ్లకు పంపారు.

ఆ రోజు చంద్రశేఖర ఆజాద్ అనే స్వాతంత్ర వీరుడిని అలహాబాద్‌లోని ఒక పార్కులో ఎన్‌కౌంటర్ చేయటానికి పోలీసులు చుట్టుముట్టారు. వారికి దొరకటం కంటే చనిపోవటమే మేలని భావించిన ఆజాద్ ఆఖరి నిమిషం వరకు పోరాడి, చివరకు తన తుపాకీతో తనే కాల్చుకుని ఆత్మహత్య చేసుకుని చనిపోయాడు. నగరం మొత్తం ఆ సంఘటన తెలుసుకుని అట్టుడికి పోయింది. ప్రజలు ఆజాద్‌కి అనుకూలంగా ర్యాలీలు నిర్వహించారు. అలాంటి ఒక ర్యాలీలోని జనాలు అదుపు తప్పి మధుబాల ఇంటి మీద రాళ్ల దాడి చేశారు. ఎవరో ఆజాద్ చనిపోతే తమ ఇంటి మీద ఎందుకు రాళ్లు వేస్తున్నారో మధుబాలకు అర్థం కాలేదు.

ఇంటి మీద కురుస్తున్న రాళ్ళ వానకు ఇంట్లోని ఆడవాళ్లందరు భయభ్రాంతులకు గురయ్యారు. అయితే క్షణాల్లో పోలీసులు అక్కడకు చేరుకున్నారు. లాఠీఛార్జ్ చేసి గుంపును చెదరగొట్టారు.

“ఎందుకు నాన్నా! వారికి మన మీద అంత కోపం?” అని తండ్రిని అడిగింది మధుబాల.

“నువు లోపలకు ఫో...” వాళ్ళ మీద ఉన్న కోపాన్ని కూతురు మీద చూపిస్తూ అన్నాడు అతను.

స్కూల్లో మరుసటి రోజు ఎవరో చెప్పారు – చనిపోయిన చంద్రశేఖర ఆజాద్ ఉనికిని బ్రిటిషు వారికి అందజేసిన ఘనత తన తండ్రిదే అని. దానికి గానూ ఆయనకు మంచి బహుమతి లభించి ఉంటుందని కూడా అనుకున్నారు.

“ఇంతకీ ఎవరీ చంద్రశేఖర ఆజాద్? ఆయన్ని పోలీసులు ఎందుకు చంపారు?” అని స్నేహితులను అడిగింది కానీ, వారికి కూడా పెద్దగా వివరాలు తెలియవు.

మరుసటి రోజు స్కూలు పూర్తి అయిన తరువాత స్కూలు లైబ్రరీలో కొంత సమయం గడిపింది. అక్కడ కూడా ఆమెకు ఉపయోగపడే సమాచారం ఏమీ దొరక లేదు. ఆ విషయం గురించి తెలుసుకోవాలంటే ఏ పుస్తకాలు చదవాలని లైబ్రేరియన్‌ని అడిగితే ఈ అమ్మాయే ఏదో హంతకురాలన్నట్లు చూశాడు.

మరుసటి రోజు స్కూలు ఎగ్గొట్టి సిటీ లైబ్రరీకి వెళ్లింది మధుబాల.

ఆమె లైబ్రరీ లోపలకు వెళ్లాల్సిన అవసరమే రాలేదు. అక్కడి ఆవరణలోనే చంద్రశేఖర్ ఆజాద్ మరణానికి సంతాపం తెలుపుతూ సభ జరుగుతోంది. తను కూడా సభికుల మధ్య కూర్చుంది ఆమె.

అక్కడ ఒకొక వక్త ప్రసంగం వింటున్న కొద్దీ కొంతకొంతగా ఆమెకు చంద్రశేఖర్ ఆజాద్ వ్యక్తిత్వం గురించి తెలిసింది. 'హిందుస్తాన్ రిపబ్లిక్ అసోసియేషన్' అన్న పేరు మొదటిసారి ఆ ప్రసంగాలలోనే విన్నది ఆమె.

రామ్ ప్రసాద్ బిస్మిల్ స్థాపించిన ఆ విప్లవ సంస్థలో చంద్రశేఖర ఆజాద్ ఒక క్రియాశీల కార్యకర్త అని తెలుసుకుంది.

సంస్థ కార్యకలాపాల నిర్వహణకు అవసరమయిన ఆయుధాలు కొనాలంటే డబ్బు అవసరం. దాని కోసం సంస్థ ఒక ప్రణాళిక రచించింది. భారతీయుల నుండి దోచుకున్న డబ్బును లక్నో ట్రెజరీలో డిపాజిట్ చేయటానికి బ్రిటిషు అధికారులు రైలులో తరలిస్తున్నారన్న విషయం సంస్థకు తెలిసింది.

షాజహాన్‌పూర్ నుండి లక్నో ప్రయాణిస్తున్న ఆ రైలులోని గార్డు దగ్గర ౩,౩౦,౦౦౦ రూపాయల డబ్బు ఉందని దళం సభ్యులు తెలుసుకున్నారు. రైలును ఆపి బ్రిటిషు ప్రభుత్వం అన్యాయంగా దోచుకున్న ఆ డబ్బు తీసుకు పోవాలని ప్రణాళిక రచించారు. ఒక్క డబ్బును దోచుకోవటం తప్ప, ఎవరినీ ఇబ్బంది పెట్టకూడదనీ, ఏ ప్రయాణికునికీ హాని కలుగ కూడదనీ నిర్ణయించుకున్నారు.

1925, ఆగస్టు 9 న రామ్ ప్రసాద్ బిస్మిల్ నాయకత్వంలో... చంద్రశేఖర ఆజాద్, అష్ఫకుల్లా ఖాన్, రాజేంద్ర లహిరి, సచింద్ర బక్షి, కేశబ్ చక్రవర్తి, మన్మథనాథ్ గుప్త, ముకుంది లాల్ గుప్త, బన్వారీ లాల్, కుందన్ లాల్, ప్రాణేశ్వర్ ముఖర్జీ ఈ దోపిడీలో పాల్గొన్నారు. కాకోరీ రైల్వే స్టేషన్ సమీపంలో చైను లాగి రైలు ఆపారు. గార్డు దగ్గర ఉన్న డబ్బు సంచులు లాక్కుని పోతుండగా డబ్బుకు రక్షణగా ఉన్న పోలీసులు కాల్పులు జరిపారు. ఆ కాల్పుల్లో ఒక ప్రయాణికుడు మరణించాడు.

బ్రిటిషు ప్రభుత్వం దోపిడీ కేసును కాస్తా హత్య కేసుగా మార్చి వేసింది. దోపిడీదారులను ఎలా అయినా పట్టుకోవాలన్న పట్టుదలతో దేశం మొత్తం వారి కోసం వెతికించింది.

చంద్రశేఖర ఆజాద్ తప్ప మిగిలిన వారందరూ ఒకరొకరుగా దొరికి పోయారు.

రామ్ ప్రసాద్ బిస్మిల్, అష్ఫకుల్లా ఖాన్, ఠాకూర్ రోషన్ సింగ్, రాజేంద్రనాథ్ లహిరికి మరణ శిక్ష విధించారు. సచింద్రనాథ్ సన్యాల్, సచింద్రనాథ్ బక్షిలను యావజ్జీవ కారాగార శిక్ష వేసి అండమాన్ జైలుకు పంపారు. మిగిలిన వారికి 14 సంవత్సరాల జైలు శిక్ష విధించారు.

సహచరులను కోల్పోయిన చంద్రశేఖర ఆజాద్ ఒక్కడే తిరిగి సంస్థను నిలబెట్టటానికి కృషి చేశాడు. మరుసటి సంవత్సరం వైస్‌రాయ్ ప్రయాణిస్తున్న రైలును బాంబులతో పేల్చి వేయటానికి విఫల యత్నం చేశాడు. 1928 లో లాలా లజపత్ రాయ్ మరణానికి కారకుడయిన జె.పి.సాండర్స్ ను లాహోర్‌లో కాల్చి చంపాడు.

దానితో అతని మీద పోలీసులు నిఘా పెంచారు. ఎలా అయినా అతన్ని పట్టుకుని ఉరికంబం ఎక్కించాలన్నది పోలీసుల పట్టుదల. ఎట్టి పరిస్థితుల్లో పోలీసులకు ప్రాణాలతో దొరక కూడదన్నది ఆజాద్ లక్ష్యం.

ఆజాద్ అలహాబాదులో ఉన్న విషయం పోలీసులకు తెలిసింది. వారు ఆజాదును వెంటాడారు. పోలీసుల మీద కాల్పులు జరుపుతూ ఆజాద్ ఒక పార్కులోకి పారిపోయాడు. పోలీసులు పార్కును చుట్టుముట్టారు. మందుగుండు అయిపోయే వరకు పోలీసులను ఎదిరించిన ఆజాద్ రివాల్వర్‌లోని ఆఖరి గుండుతో తనను తాను కాల్చుకుని చనిపోయాడు.

ఒళ్ళు గగుర్పొడిచే ఆయన సాహస కృత్యాలు విన్న మధుబాలకు ఆయన్ని కాక పోయినా ఆయన నిర్వహిస్తున్న విప్లవ సంస్థను చూడాలనిపించింది.

“హిందుస్తాన్ రిపబ్లిక్ అసోసియేషన్ ఆఫీసు ఎక్కడ ఉంటుంది?” అడిగింది ఆమె తన పక్కన నిలబడి ప్రసంగాలు వింటున్న వ్యక్తిని. ఆయన వయసులో పెద్దవాడు. ఆమె ప్రశ్న విని కుతూహలంగా ఆమె వైపు చూశాడు. తరువాత నెమ్మదిగా, “ఎందుకు?” అని అడిగాడు.

“నాకు వారు చేసే కార్యక్రమాల గురించి మరింత తెలుసుకోవాలని ఉంది...” అంది మధుబాల.

ఎటూ కాకుండా తల ఆడించాడాయన.

నాలుగు రోజుల తరువాత ఆ సంస్థ జరుపుకుంటున్న రహస్య మీటింగుకు ఆమెను తీసుకు వెళ్లాడు అతను.

ఇంత చిన్న వయసు పిల్ల వారి మీటింగుకు రావటం ఇదే మొదటిసారి.

“ఇంతకీ ఎవరి అమ్మాయివి నువ్వు?” అడిగారు ఎవరో కాసేపటి తరువాత.

సమాధానం ఆమె చెప్పలేదు. ఆమెను తీసుకు వచ్చిన వ్యక్తి చెప్పాడు.

కొద్ది సేపు సభలో నిశ్శబ్దం ఆవరించింది. ఆ తరువాత అందరూ ఆ అమ్మాయి వైపు కౄరంగా చూశారు. “నీ తండ్రి ఇచ్చిన సమాచారంతో మా నాయకుడు చనిపోయాడు. నువ్వు ఈ సమావేశ వివరాలు చెప్పి మమ్మల్నందరినీ చంపించదలచుకున్నావా?” అన్నారు కోపంగా.

ఆ అమ్మాయిని తీసుకు వచ్చిన వ్యక్తి వారిని వారించాడు. “ఆ అమ్మాయి ఇక్కడకు వచ్చిన సంగతి తెలిస్తే మీరు ఏమీ చెయ్యనవసరం లేదు. ఆ అమ్మాయి తండ్రే ఆ అమ్మాయిని చంపుతాడు. అయినా రిస్క్ చేసి, పెద్దలకు భయపడకుండా, అంత చిన్న పిల్ల ఇక్కడకు వచ్చిందంటే ఆ అమ్మాయి నిబద్ధత అర్థం చేసుకోండి...” అన్నాడు.

ఆ తరువాత ఆమె వారి సమావేశాలకు రెగ్యులర్‌గా హాజరయ్యేది. వారి దగ్గర ఉన్న రాజకీయ గ్రంథాలు, విప్లవ సాహిత్యం చదవటం మొదలు పెట్టింది. ఒక్కొక్క పుస్తకం చదువుతున్న కొద్దీ ఆమె మనో నేత్రాలు విచ్చుకోవటం మొదలయింది.

దేశం ఎలాంటి బానిసత్వంలో ఉందో తెలుసుకుంది. దేశ ప్రజల బాధల గురించి తెలుసుకుంది. జరుగుతున్న పోరాటాల గురించి తెలుసుకుంది. ఆ తరువాత ఆమె తన ఇంట్లో ఎన్నో రోజులు ఉండలేక పోయింది. పదిహేను సంవత్సరాలు నిండిన పది రోజుల తరువాత ఒక చిన్న ఉత్తరం రాసి ఇల్లు వదిలి వెళ్లి పోయింది.

ఆ తరువాత మధుబాల దేశం నలుమూలలా తిరిగింది. ఎన్నో విప్లవ కార్యక్రమాల్లో పాల్గొంది. ఏడు సంవత్సరాల పాటు బ్రిటిషు ప్రభుత్వం మీద ఎన్నో దాడులు చేసింది. ఆమె పేరు కానీ, రూపం కానీ ఎవరికీ తెలియదు. కానీ... ఆమె బ్రిటిషు ప్రభుత్వానికి చేస్తున్న హాని రోజురోజుకీ ఎక్కువవటంతో, ప్రభుత్వం ఎలా అయినా ఆమెను పట్టుకోవాలని ఇంటెలిజెన్స్ వర్గాలకు ఆదేశాలు ఇచ్చింది. ఆజాద్ తరువాత ప్రభుత్వాన్ని అంతగా చికాకు పెట్టింది మధుబాలే.

1942 లో మద్రాసులో బ్రిక్స్ అనే ఒక జడ్జి పదహారు సంవత్సరాల యువకుడికి మరణశిక్ష విధించాడు. ఆ యువకుడు చేసిన నేరం ప్రభుత్వ వ్యతిరేక ప్రదర్శనల్లో పాల్గొనటం. విచారణలో మిగిలిన వారిలా అతను క్షమాపణ చెప్పటానికి నిరాకరించాడు. దానితో అతని మీద రాజద్రోహ నేరం ఆరోపించి అతనికి అక్కడికక్కడే మరణ శిక్ష విధించాడు.

దేశంలోని మేధావులందరూ ఆ శిక్ష చాలా ఎక్కువని, దానిని తగ్గించమనీ ఎన్ని విజ్ఞప్తులు చేసినా బ్రిక్స్ ఒప్పుకోలేదు. పైగా తను విధించిన శిక్షని వెంటనే అమలు చేయమని మరోసారి ఆదేశాలిచ్చాడు.

అప్పుడు హిందుస్తాన్ రిపబ్లిక్ అసోసియేషన్ ఒక ప్రకటన విడుదల చేసింది. ఆ యువకుడికి మరణ శిక్ష అమలు చేసే లోపు, బ్రిక్స్‌ని చంపుతామని ఆ ప్రకటన సారాంశం.

వెంటనే బ్రిటిషు ప్రభుత్వం అలర్ట్ అయింది. బ్రిక్స్కి ఏదన్నా జరిగితే అది ప్రభుత్వ ప్రతిష్టకు భంగం కాబట్టి అతనికి పోలీస్ ప్రొటెక్షన్ పెంచింది.

హిందుస్తాన్ రిపబ్లిక్ అసోసియేషన్ తరుపున అనుకున్న పని చేయటానికి మధుబాల మద్రాస్ ప్రయాణం అయింది.

ఆమెకు మద్రాసులో ఉన్న కొంత మంది విప్లవ సానుభూతి పరులు సహాయం చేయటానికి ఒప్పుకున్నారు.

అతన్ని ఇంటి దగ్గర హత్య చేయటం తేలిక అని స్థానికులు మధుబాలకు చెప్పారు.

అయితే మధుబాల దానికి ఒప్పుకోలేదు. “మనం హంతకులం కాదు రహస్యంగా హత్య చేయటానికి. ప్రజా కోర్టులో బ్రిక్స్ దోషిగా నిర్ధారించ బడ్డాడు. అతనికి విధించే శిక్ష కూడా బహిరంగంగానే అమలు చేయాలి…” అంది ఆమె.

ఆమె ధైర్యానికి అచ్చెరువొందుతూ అందరూ ఆమె వైపు ఆశ్చర్యంగా చూశారు.

నాలుగు రోజులు రెక్కీ చేసిన తరువాత తన ప్లాను వివరంగా చెప్పింది ఆమె. ప్లాను అమలు చేయటంలో తనకు ఎవరి సహాయమూ అవసరం లేదనీ, తప్పించుకోవటంలో మాత్రం వారి సహాయం తీసుకుంటాననీ చెప్పింది.

ప్లాను అమలు చేయవలసిన రోజున ఆమె కోర్టు దగ్గరకు చేరుకుంది. లోపలకు వచ్చే అందరినీ పూర్తిగా చెక్ చేసి కానీ పంపటం లేదు. అందుకే ఏ ఆయుధం లేకుండా వచ్చింది మధుబాల.

సాయంత్రం అయిదు గంటలకు కోర్టులోని తన ఛాంబర్ నుండి బయటకు వచ్చాడు బ్రిక్స్. అతని చుట్టూ నలుగురు పోలీసులు రక్షణగా ఉన్నారు. వారు కాకుండా మఫ్టీలో మరి కొందరు కోర్టు ఆవరణలో ఉన్నారు. కారిడార్‌లో నడుచుకుంటూ ముందుకు వస్తున్నాడు బ్రిక్స్. అదే కారిడార్‌లో ఎదురుగా వస్తోంది మధుబాల. సరిగ్గా బ్రిక్స్ బృందం ఆమె దగ్గరకు వచ్చేటప్పటికి ఒక పోలీసు మధుబాలని పక్కకు తప్పుకోమన్నట్లు పక్కకు జరిపాడు. కాలు స్లిప్ అయి మధుబాల కింద పడి పోయింది. అప్రయత్నంగా ఆగాడు బ్రిక్స్. ఆమెను లేపటానికి చేయి అందించాడు. ఆ చేయి అందుకుని పైకి లేచింది మధుబాల. థాంక్స్ చెప్పి ముందుకు వెళ్ళి పోయింది.

అదే సమయంలో అక్కడ ఉన్నాడు ఒక ఫొటోగ్రాఫర్.

బ్రిక్స్ ఒక యువతికి సహాయం చేస్తున్న సంఘటనని తన కెమేరాలో బంధించాడు.

ముందుకు నడుస్తున్న బ్రిక్స్ చేయి చురుక్కుమంటుంటే ఒకసారి అటు వైపు చూసుకున్నాడు. చిన్న రక్తపు చుక్క కనిపించింది. అది అలా ఎందుకు వచ్చిందో అర్థం కాలేదు అతనికి. దాని గురించి ఏదో ఆలోచించే లోపు అతనికి కళ్ళు తిరిగినట్లు అనిపించింది. అతని నడకలో వేగం తగ్గి పోయింది. శరీరమంతా నీరసం ఆవహిస్తుంటే తనకు ఏదో జరుగుతుందని అతనికి అర్థమయింది. పక్కనున్న వారికి ఏదో చెప్పబోయి, చెప్పలేక కుప్పకూలి పోయాడు బ్రిక్స్.

ఏం జరిగి ఉంటుందో అతనికి అర్థం కాకపోయినా, అతని పక్కన ఉన్న పోలీసులకు అర్థం అయింది. కొంతమంది బ్రిక్స్‌ని హాస్పిటల్‌కి తీసుకు వెళ్లే ఏర్పాట్లు చేస్తుంటే, మరికొందరు కొన్ని క్షణాల క్రితం ఎదురయిన యువతి కోసం పరుగెత్తారు. ఇంకొందరు ఫొటోగ్రాఫర్ దగ్గర ఉన్న కెమేరా తీసుకుని స్టూడియోకు వెళ్లారు.

గంటలో ఆ యువతి ఫొటో ప్రింట్ అయింది. మరో గంటలో పోస్టర్లు ప్రింట్ అయ్యాయి. రైల్వే స్టేషన్లు, బస్‌స్టాండ్లు మాత్రమే కాదు… ఊరు మొత్తం ఆ యువతిని పట్టించిన వారికి భారీ బహుమతి ఇస్తామని పోస్టర్లు అతికించారు.

ఇప్పటి వరకు మధుబాల పేరు కానీ, మొహం కానీ ఎవరికీ తెలియదు. ఒకసారి ఆ రహస్యం బట్టబయలు అయ్యాక ఇక పోలీసులకు తనను పట్టుకోవటానికి ఎంతో సమయం పట్టదని ఆమెకు తెలుసు. మద్రాసు నుండి బయటకు

వెళ్లే అన్ని మార్గాలు మూసి వేస్తారని కూడా ఆమెకు తెలుసు. ఇప్పటివరకు ఆమెకు సహాయంగా ఉన్న లోకల్ సభ్యుడు – "అక్కా! ఒకటే మార్గం… సింగపూర్ వెళ్లే షిప్ కాసేపట్లో బయలుదేరుతుంది. రైల్వే స్టేషన్, బస్టాండులు వెతికినట్లు షిప్ యార్డు వెతకరు. పైగా షిప్ గంటలోపే బయలుదేరుతుంది. వారు షిప్‌యార్డులో కూడా వెతికే ప్రయత్నం చేసే లోపు నువు సముద్రం మీదకు వెళ్లిపోతావు…" అన్నాడు.

ఆమెకు కూడా తప్పించుకోవటానికి అంతకంటే మరో మార్గం కనిపించలేదు. పది నిమిషాల్లో తన ఆహార్యం మార్చుకుని పురుషుడిలా తయారయింది ఆమె.

ఆమెకు కొద్దిగా అదృష్టం కూడా కలిసి వచ్చింది.

షిప్‌యార్డులో పోలీసులు వెతుకులాట తీవ్రతరం చేసేటప్పటికి ఆమె ఎక్కిన షిప్ పోర్టును విడిచి వెళ్లిపోయింది.

వారం తరువాత షిప్ దిగి సింగపూరు పోర్టు నుండి బయటకు వచ్చిన ఆమెకు అక్కడ మరికొన్ని పోస్టర్లు స్వాగతం పలికాయి. కాకపోతే ఇవి ఆమెను పట్టుకోవటానికి వేసిన పోస్టర్లు కాదు. ఇండియన్ నేషనల్ ఆర్మీలో చేరమని యువతీ యువకులను ఆహ్వానిస్తున్న పోస్టర్లు.

ఆమెకు తన తదుపరి అడుగు ఎటు వేయాలో ఎవరూ చెప్పకుండానే అర్థం అయింది.

ప్రస్తుతం…

"ఇంకేముంది, ఆమె ఆజాద్ హింద్ ఫౌజ్‌లో చేరగానే మీకు పరిచయం అయి ఉంటారు…" తరువాత జరిగింది ఊహిస్తూ చెప్పాడు మయాంక్.

నవ్వింది కాంచనమాల. "నువ్వు ఊహించినది జరగటానికి ఛాన్సే లేదు. ఎందుకంటే నేను అప్పటికి ఫౌజులో చేరలేదు…"

"అదేంటి మేడమ్! మీరు మొదట చేరి ఉంటారనుకున్నానే…"

"చెప్పానుగా… అప్పటి దాని కమాండర్ మోహన్‌సింగ్ మీద ఎంతో మందికి నమ్మకం లేదు. అలాంటి వారిలో నేను కూడా ఒక దాన్ని."

"మరి మీ పరిచయం ఎలా, ఎప్పుడు జరిగింది?"

"ఆ మాటలు చెప్పుకోవటానికి ఇంకా కొద్దిగా సమయం ఉంది. ఈలోపు మనం ఒక చిన్న పని చేద్దాం. నేను అప్పుడు నివసించిన ఇంటిని కనుక్కునే ప్రయత్నం చేద్దాం…" అంది కాంచనమాల.

మరుసటి రోజు ఇద్దరు ఆ ప్రయత్నంలో పడ్డారు. దాదాపు రెండు, మూడు గంటల ప్రయాస తరువాత కూడా అప్పటి ఆ ఇంటిని కాదు కదా, ఆ లొకాలిటీని కూడా ట్రేస్ చేయలేక పోయారు ఇద్దరు.

"సింగపూర్ మారిపోయింది…" నిట్టూరుస్తూ మరోమారు అంది కాంచనమాల.

అయితే ఒక పక్క ఈ పని చేస్తూనే మయాంక్ ఆమెతో మధుబాల గురించిన విషయాలు చెప్పించుకున్నాడు. రాత్రి ఒకసారి నెమరు వేసుకుని ఉందేమో, ఆమె కూడా మధుబాల నేపథ్యం గురించి తనకు గుర్తు ఉన్నదంతా అతనికి చెప్పింది.

మధ్యాహ్నం లంచ్ తరువాత సివిలియన్ వార్ మెమోరియల్ చూడటానికి వెళ్లారు.

అక్కడ నీడలో కూర్చుని విశ్రాంతి తీసుకుంది కాంచనమాల.

మయాంక్ తను కూడా ఆమె పక్కన కూర్చుంటూ, “నిన్న మీరు చెప్పిన నోట్సు రాసుకుంటుంటే, కొన్ని అనుమానాలు వచ్చాయి. గూగుల్ సెర్చ్ చేస్తే తీరతాయేమో తెలియదు, కానీ మీ నోటి నుండి వినాలని నా కోరిక.” అన్నాడు.

“నాకు తెలిస్తే తప్పక చెప్తాను మయాంక్.” అంది కాంచనమాల.

“నా అనుమానం బోస్ గారి గురించి మేడమ్. భారత రాజకీయాల్లో బోస్ కూడా ఒక రాజకీయవేత్త. అలాంటి వ్యక్తికి వివిధ దేశాల అధినేతలతో సంబంధాలు ఎలా ఏర్పడ్డాయి? విదేశాలలో ఇండియా అంటే బోస్ అనేంతగా ఆయనకు పేరు ఎలా వచ్చింది? కొందరు దేశాధ్యక్షులు ఆయన్ని చంపాలి అనేటంతగా ద్వేషం పెంచుకోవలసిన అవసరం ఏమొచ్చింది? అలానే మరికొందరు ప్రాణాలకు తెగించి ఆయన్ని కాపాడాలన్నంత గొప్ప పనులు ఆయన ఏం చేశారు?”

“దీనికి సరయిన సమాధానం ఒక్క ముక్కలో చెప్పేది కాదు. కానీ కొంత కాలం ఆయనతో కలిసి పనిచేసిన కారణంగా నా అభిప్రాయం చెప్పగలను. దానితో పాటు అప్పటి అంతర్జాతీయ రాజకీయాల నేపథ్యం కూడా తెలియాలి. అసలు వీటన్నిటి కంటే ముందు నీకు బోసు వ్యక్తిత్వం గురించి క్లుప్తంగా అయినా చెప్పకపోతే తరువాత ఆయన గురించి నేను చెప్పే మాటలేమీ నీకు అర్థం కావు…” అంటూ మొదలు పెట్టింది ఆమె.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS